వనమహోత్సవానికి సన్నద్ధం

- 29నర్సరీల్లో 2లక్షల87వేల మొక్కలు పెంపకం
- ప్రతి గ్రామంలో 8నుంచి 13వేలు నాటడమే లక్ష్యం
- పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నర్సరీల్లో అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని విధిగా చేపడుతున్నారు. మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో నర్సరీల నిర్వహణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి పంచాయతీలో 8నుంచి 13వేల మొక్కల చొప్పున మొత్తం మండల వ్యాప్తంగా 2లక్షల87వేల మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవుతున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయ ప్రాంగణాలు, బస్టాండ్, రోడ్లకు ఇరువైపులా, రైతులకు ఉపయోగపడే విధంగా అన్ని రకాల మొక్కలు నాటించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పండ్ల మొక్కలైన నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరితో పాటు పూల మొక్కలైన గులాబీ, మందార, గన్నేరు, కాగితపు పూలు తదితర మొక్కలతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు జామ, మారేడు వంటి మొక్కలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీ పనులను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీఓ, ఏపీఓలు పరిశీలిస్తున్నారు.


అనంతారంలోని నర్సరీలో మొక్కలకు నీరు పోస్తున్న వన సేవకురాలు

నర్సరీల్లో పనులు పర్యవేక్షిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపక కార్యక్రమాన్ని చేపట్టాము. పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకం చురుకుగా సాగుతున్నాయి. మండలంలో హరితహారం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీలను నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు పలు సూచనలు చేస్తున్నాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

అర్వపల్లి : వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్య తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం హెచ్చరించారు. మంగళవారం అర్వపల్లిలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించిన వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య సిబ్బంది విధులకు హాజరయ్యే విషయంలో సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచేలా వైద్యసిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్, సీహెచ్‌ఓ బిచ్చు నాయక్, డీపీఎంఓ సురేష్, సూపర్‌వైజర్ లలిత, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లయ్య

తుంగతుర్తి : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయి ఎదగాలని పాఠశాల ప్రిన్సిపాల్ పి.మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో శ్రీ విద్యాభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎండీ నజీర్, వెంకటగోపాల్, ఉపాధ్యాయులు జి.లింగమూర్తి, సురేష్, అనిత, రాధ, స్వప్న, ఉమా, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగవివక్ష లేని సమాజానికి పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంతోషిమాత

చివ్వెంల : లింగవివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి వి.సంతోషిమాత అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో రోజురోజుకు మహిళల పట్ల దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారం కోసం మహిళలతో ప్రకటనలు ఇప్పిస్తున్నారని అన్నారు. గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో శ్రామిక మహిళలను శ్రమదోపిడీతో పాటు, లైంగిక దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాజంలో అన్నివర్గాల ప్రజలు ఈ విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, జయమ్మ, మీనాక్షి, రాధ, రహమతి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సూర్యాపేట : పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు సువెన్ ఫార్మసీ సహకారంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్థానిక ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం కూడా 420మంది పేద విద్యార్థులకు అందజేయనున్నట్లు, విద్యార్థులు, పాఠశాల ప్రిన్సిపాల్స్‌తో నేరుగా వచ్చి అందుకోవాలని తెలిపారు. సమావేశంలో అక్షర ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాస్, సుభాష్ చంద్రబోస్, బత్తుల ఉపేందర్, నజీర్‌బాషా, వెంకన్న ఉన్నారు.

ధ్యానంతో అనారోగ్య సమస్యలు దూరం


శిక్షణలో మాట్లాడుతున్న గోవర్ధనగిరి

అర్వపల్లి : ధ్యానంతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎస్.గోవర్ధనగిరి అన్నారు. అర్వపల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా–ధ్యానోత్సవంలో భాగంగా మంగళవారం రెండోరోజు జరిగిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ధ్యానంపై దృష్టి సారించాలన్నారు. ధ్యానం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రశిక్షకులు ఎం.వెంకటరంగారావు, ఉపేందర్, శేఖర్, వెంకటయ్య, సందీప్, రంజిత్, ఉమ, సంతోష, అభ్యాసకులు మను బోతుల వీరయ్య, వనం రమేష్, దడిపల్లి వెంకట్, మేకల సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, దిర్శనపు కృష్ణమూర్తి, జ్యోతి, రజిని, ఉమ, శైలజ పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడాలి


మాట్లాడుతున్న కంబాల శ్రీనివాస్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటి సామర్థ్యాన్ని పెంచి ఎండుతున్న పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండలంలోని తొండ గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాలు సమృద్ధిగా రాకపోవడంతో చేతికి వచ్చిన వరిపంట ఎండిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమకాలేదని, వెంటనే జమ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎల్లంల యాదగిరి, శ్రీకాంత్, కనుక అశోక్, కొమురెల్లి, ఇక్బాల్, ఫయాజ్, నర్సయ్య, మల్లయ్య, సత్తయ్య, శ్రీనివాస్, ఉప్పలయ్య, కొమురయ్య, యాకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఎదగాలి


ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్వోత్తంరెడ్డి, వేణారెడ్డి

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఏపీసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్లో సువెన్ ఫార్మా కంపెనీ సహకారంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యార్థినులు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసి హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని కోరడంతో సువెన్ ఫార్మా కంపెనీ వారిని సంప్రదించి వారి సహకారంతో సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేయించి ప్రహరీ నిర్మాణం చేయిస్తున్నట్లు తెలిపారు. సువెన్ కంపెనీ చేస్తున్న స్వచ్ఛంద సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి లత, సువెన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రమేష్‌బాబు, సీనియర్ మేనేజర్ వెంకటరమణ, పీఆర్వో సైదులు, కక్కిరేణి శ్రీనివాస్, బైర్ శైలేందర్, వేములకొండ పద్మ, జహీర్, ఎలిమినేటి అభినయ్, యాదగిరి, రాజేందర్, శబరినాథ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం


అర్వపల్లి : జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఆత్మకూర్ (ఎస్) : ఏనుబాముల జెడ్పీ పాఠశాలలో..


సూర్యాపేట : కాసరబాద పాఠశాలలో ..


నూతనకల్ : మిర్యాల ప్రాథమిక పాఠశాలలో..

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్, తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులుగా పాత్రలు పోషించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విజయలక్ష్మి, చంద్రారెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఏనుబాముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి అలరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.ధారాసింగ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం భరణికుమార్, ఉపాధ్యాయులు ఝాన్సీ, పి.శ్రీనివాస్, ఎస్.వెంకన్న, మహాలక్ష్మి, దేవరాజ్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నూతనకల్ : మండలంలోని మిర్యాల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులుగా పాత్రలు పోషించారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం వాంకుడోతు వెంకన్ననాయక్ బహుమతులు అందజేశారు.

సూర్యాపేట : మండలంలోని కాసరబాదలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

నూతనకల్ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూర్యాపేట డీఎస్పీ జి.రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ కేసుల నిమిత్తం వచ్చే బాధితులకు న్యాయ సలహాలు ఇవ్వడంతో పాటు న్యాయం జరిగే విధంగా పోలీసులు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ మహేంద్రనాథ్ ఉన్నారు.

బోరు పూడ్చిన వ్యక్తిపై ఫిర్యాదు

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో మంచినీటి బోరును పూడ్చిన వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి రాగి చెల్మయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం 30సంవత్సరాల క్రితం మాజీ ఎంపీటీసీ చిత్తలూరి నారాయణ ఇంటి ముందు వేసిన బోరులో కొద్దిరోజుల క్రితం మోటార్‌ను తొలగించారు. ప్రస్తుతం బోరులో మోటారును బిగించేందుకు వెళ్లగా బోరు రాళ్లతో పూడ్చివేసి ఉందని, పూడ్చివేతకు కారకుడైన నారాయణపై ఫిర్యాదు చేసి ఉన్నతాధికారులకు తెలిపినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సంఘటనా స్థలాన్ని ఆర్ఐలు హసన్‌అలీ, కర్ణాకర్‌రెడ్డి సందర్శించి పంచానామా చేశారు.

ఎంఈఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక


వల్లపట్ల కృష్ణ
జిల్లా అధ్యక్షులు


అవిరిండ్ల లెనిన్
ప్రధాన కార్యదర్శి

సూర్యాపేటటౌన్ : పట్టణంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మద్దిమడుగు సైదులు, జిల్లా గౌరవ సలహాదారుడిగా బరపటి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడిగా వల్లపట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అవిరిండ్ల లెనిన్, కోశాధికారిగా జిల్లా జానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా పత్తేపురం లింగయ్య, అయోధ్య, సహాయ ప్రధాన కార్యదర్శిగా ఎడవల్లి కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా రవీందర్, పులి శ్రీనివాస్, నందిపాటి సైదులు, వెంకన్న, కోడి మహేష్, ఉపేందర్, రాము, ప్రకాష్, మహిళా ఉపాధ్యక్షులుగా శ్వేత, జ్యోతి, మహిళా కార్యదర్శిగా శారద, కార్యదర్శులుగా యాదగిరి, పిడమర్తి ప్రసాద్, సతీష్, సైదులు, వెంకన్నను ఎన్నుకున్నారు. ఈ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్, జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి


ఆదర్శ వివాహాన్ని జరిపిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : సమాజంలో ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మునగాల మండలంలోని నరసింహులగూడెం గ్రామానికి చెందిన నందిపాటి వెంకటేష్, పెన్‌పహాడ్ మండలంలోని చీదేళ్ల గ్రామానికి చెందిన రెడపంగి తేజశ్రీల ఆదర్శ వివాహం జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కట్నకానుకల పేరుతో పేదల కుటుంబాలపై ఆర్థిక భారాలు పడి ఇబ్బందులు పడుతున్న సందర్భాల్లో ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆదర్శ, కులాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, నరసింహారావు, పార్టీ టూ టౌన్ కార్యదర్శి నాగమణి, నర్సింహులగూడెం మాజీ సర్పంచ్ నందిపాడు వెంకన్న, నందిపాటి సతీష్, నాగేంద్రబాబు, గోపాల్‌దాస్, శ్రీరాములు, నందిపాటి శేఖర్, మహేష్, బన్నీ, నవీన్ పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అర్వపల్లి : వననర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ టి.గోపి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాణ్యతండాలో ఏర్పాటు చేసిన వననర్సరీని ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా నర్సరీల్లో 1,79,850 మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి


తిరుమలగిరి (తుంగతుర్తి) : అనంతారం మోడల్‌స్కూల్‌లో నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఇంటర్ పరీక్షలకు తిరుమలగిరి పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సంజీవ్‌కుమార్ మంగళవారం తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు అనంతారం మోడల్‌స్కూల్, తిరుమల సహకార జూనియర్ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతారం మోడల్‌స్కూల్‌లో 180మంది, తిరుమల కళాశాలలో 165మంది పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షలు 9గంటలకు ప్రారంభమవుతాయని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందే చేరుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తుంగతుర్తి : మండల కేంద్రంలో నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మంగళవారం పరీక్ష ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. తుంగతుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆత్మకూర్ (ఎస్) : ఇంటర్మీడియట్ పరీక్షలకు మండల వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ, నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 263 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు నెమ్మికల్ కేంద్ర పరీక్షల ప్రధాన అధికారి గునగంటి వెంకటేశ్వర్లు తెలిపారు.

విప్లవోద్యమ నిర్మాణానికి రవన్న సేవలు మరువలేనివి


భానుపురి (సూర్యాపేట) : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : విప్లవోద్యమ నిర్మాణానికి రవన్న చేసిన సేవలు మరువలేనివని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. స్థానిక చంద్రా పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి సందర్భంగా రూపొందించిన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో నక్సల్బరీ పోరాట ప్రభావంతో విప్లవాల వెల్లువతోనే గోదావరి గిరిజన రైతాంగ ప్రతిఘటన ఉద్యమం కొనసాగిందన్నారు. ఈ పోరాటాన్ని విస్తరింపజేయడంలో రవన్న పాత్ర కీలకమైందన్నారు. రవన్న వర్ధంతి సభను ఈ నెల 11న ఖమ్మంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో సభ, జెడ్పీ సెంటర్ నుంచి ప్రదర్శన ఉంటుందని అందులో జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు నర్సిరెడ్డి, వెంకన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

నాగారం : ఖమ్మం పట్టణంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 11న జరిగే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాయల రవన్న 9వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రవన్న వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత విప్లవోద్యమంలో రవన్న పాత్ర మరువలేనిదన్నారు. రవన్న పోరాట స్ఫూర్తితో దేశంలో, రాష్ట్రంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, న్యూడెమోక్రసీ నాయకులు బయ్యం లింగయ్య, పల్లెర్ల సోమయ్య, పడిశాల సంజీవ, తంగేళ్లపల్లి విక్రమ్, నాతి బాలరాజు, పేరమళ్ల జానీ, బి.మల్లయ్య, ఏర్పుల శ్రీను, అంజమ్మ, లక్ష్మమ్మ, మంజుల, సుమలత పాల్గొన్నారు.

అర్వపల్లి : ఖమ్మం పట్టణంలో ఈ నెల 11న జరిగే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు రాయల సుభాష్‌చంద్రబోస్ అలియాస్ రవన్న వర్ధంతి సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ నాయకుడు పోలెరబోయిన పెద్దలింగయ్య, గ్రామ కార్యదర్శి వడకాల బయ్యన్న, మధుకర్, దాసరి నాగయ్య, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : న్యూడెమోక్రసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు దాసరి శ్రీనివాస్, గద్దం శ్రీను, మహేష్, పాపయ్య, సందీప్, మల్లయ్య పాల్గొన్నారు.


నాగారం : డి.కొత్తపల్లిలో ..


అర్వపల్లి : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అంగన్‌వాడీలను అరెస్టు చేయడం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

పెన్‌పహాడ్ : హక్కుల కోసం పోరాడుతున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ బొలిశెట్టి భాస్కరమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్ ముట్టడి వెళ్తుండగా అరెస్టు చేయడం హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జానీబేగం, ఊర్మిళ, వెంకటమ్మ ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న మానసిక వైద్య నిపుణురాలు స్రవంతి

పెన్‌పహాడ్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మానసిక వైద్య నిపుణురాలు స్రవంతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల, అనాజీపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు పీహెచ్‌సీఓ హెచ్ఈఓగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రాజు తల్లిదండ్రులు వెంకటలక్ష్మమ్మ, లక్ష్మణ్‌రాజు జ్ఞాపకార్థం విద్యార్థులకు సుమారు రూ.20వేలు విలువ చేసే పరీక్షా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, ఎస్ఓ హసీయా జబీన్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

తుంగతుర్తి : తుంగతుర్తి రైతు సేవా సహకార సంఘంలో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట సొసైటీ కార్యదర్శి వందనపు వెంకటేశ్వర్లు, సిబ్బంది యాదగిరి, మహేష్ ఉన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

అర్వపల్లి : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. రామన్నగూడెంలో నిర్వహిస్తున్న కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలకు మంగళవారం ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకుడు మారపాక రాములు, అశ్విన్, నరేష్, జనార్దన్, వినోద్, పరమేష్, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి

పెన్‌పహాడ్ : విద్యార్థుల విద్యాభివృద్ధికి పట్టుదలతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దోసపహాడ్‌లో గల ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న పిండిగ నరసయ్య ఆయన తల్లిదండ్రులు పిండిగ భిక్షం–సుశీల జ్ఞాపకార్థం పాఠశాల బోర్డు నిర్మాణం కోసం రూ.15వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పందిరి రేణుకవీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తుంగతుర్తి : మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తునికి ఉపేంద్ర కొంతకాలంగా బ్లాక్ ఫంగస్ వ్యాధితో బాధపడుతుంది. ఆమె కొంతకాలంగా చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బాధితురాలికి రూ.10వేల ఆర్థికసాయం పంపించగా మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధితురాలికి అందజేశారు.

ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలి

ఆత్మకూర్ (ఎస్) : ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి ఎస్సీ, ఎస్టీ ఉపకులాలకు 11శాతం వాటా కల్పించాలని ఎంఎస్‌పీ(మహాజన సోషలిస్ట్ పార్టీ) జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని నెమ్మికల్లులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మేడి కృష్ణమాదిగ, జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌మాదిగ, నాయకులు చింతలపాటి చిన్నశ్రీరాములు మాదిగ, గంటా భిక్షపతి, ప్రవీణ్, మల్లేష్, జగన్, బొడ్డు విజయ్, చింత మధు, తదితరులు పాల్గొన్నారు.